సాక్షి ఖమ్మం

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



క్రీడాకారులు సత్తా చాటాలి

జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా తర్ఫీదు పొందాలని ఖమ్మం మేయర్ నీరజ సూచించారు. 8లో



కాటేస్తున్న ఎయిడ్స్ భూతం!

జిల్లాలో ఏటా ఎయిడ్స్ కేసులు పెరుగుతుండగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 285 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30°/ 23°

జిల్లాలో ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 10–30గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన ఖమ్మం, కల్లూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అలాగే, సోమవారం ఉదయం రఘునాథపాలెం మండలం శివాయిగూడెం, ఉదయ్‌నగర్, మంచుకొండలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఇక మంగళవారం 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీలో సీసీ రోడ్లకు, 44వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ఐదు మండలాలకు నిలిచిన నీటి సరఫరా

కొణిజర్ల: మండల కేంద్రమైన కొణిజర్లతో పాటు మరో నాలుగు మండలాల్లో మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా మండలాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. కొణిజర్లలోని గేట్‌వాల్వ్‌లో లోపం ఏర్పడి, తనికెళ్ల సమీపాన పైప్‌లైన్ లీకేజీ అయింది. దీంతో కొణిజర్లతో పాటు మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఇటీవల తరచూ లీకేజీలు ఏర్పడుతున్నా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు రాకపోవడంతో పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో గేట్‌వాల్వ్‌లకు స్థానికంగా మరమ్మతు చేయిస్తున్న అధికారులు కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు పునరావృతమవుతున్నాయి. కాగా, ఆదివారం మధ్యాహ్నానికి మరమ్మతులు పూర్తిచేసి సాయంత్రం నుంచి నీరు విడుదల చేస్తామని మిషన్ భగీరథ ఏఈ సురేష్ తెలిపారు.

ప్రీస్కూల్‌ను పకడ్బందీగా అమలు చేయండి



కోడిగుడ్లను తూకం వేయిస్తున్న ఆర్‌జేడీ

సత్తుపల్లిరూరల్/సత్తుపల్లి(కల్లూరు): అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఐసీడీఎస్ వరంగల్ ఆర్‌జేడీ సీహెచ్.ఝాన్సీ లక్ష్మీబాయి సూచించారు. సత్తుపల్లి, కల్లూరు మండలాల్లోని పలు కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, కోడిగుడ్ల నాణ్యతతో పాటు హాజరు రికార్డులు పరిశీలించారు. చిన్నారుల హాజరు శాతం పెంచేలా పర్యవేక్షిస్తూ కొత్త సిలబస్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓలు కనకదుర్గ, నిర్మల, సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, రమాదేవి, సంధ్య, భవాని, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీప్రసన్న, సావిత్రి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిని జల్లెడ పడుతున్న పోలీసులు

దంపతుల హత్య కేసులో నిందితుల గుర్తింపునకు యత్నాలు



అద్దెకు ఉంటున్న వారి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన దంపతులు వెంకటరమణ–కృష్ణకుమారి గత మంగళవారం రాత్రి హత్యకు గురి కాగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు చుట్టుపక్కల గ్రామాల్లో విచారిస్తుండగా సబ్‌డివిజన్ పోలీసులు శనివారం మండల కేంద్రంలోని ఇంటింటా జల్లెడ పట్టారు. ఇళ్లలో అద్దెకు ఉంటున్న వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఎన్నాళ్లుగా ఉంటున్నారో వివరాలు ఆరా తీశారు. అలాగే, అన్ని షాపుల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అంతేకాక శనివారం పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. మరోపక్క సెల్‌ఫోన్ లభించిన ప్రదేశంలో షాపుల నుంచి సీసీ ఫుటేజీ సేకరించి ఫోన్ పడేసిన వ్యక్తి బైక్‌పై ఎటు వైపు వెళ్లాడో పరిశీలిస్తున్నారు. కాగా, హత్య జరిగిన ఇంటి చుట్టుపక్కల ఇళ్లలోని వారు, అద్దెకు ఉంటున్న వారు తమకు తెలియకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లొద్దని పోలీసులు ఆదేశించినట్లు సమాచారం. శనివారం హత్య జరిగిన ఇంటిని అదనపు డీసీపీ ప్రసాద్‌రావు పరిశీలించి స్థానిక పోలీసులతో సమీక్షించారు.



రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు (ఫైల్)



అవి కాదు.. అంతకు మించి !

జిల్లాలో పెరిగిన ఇళ్ల సంఖ్య

- సమగ్ర కుటుంబ సర్వే పూర్తయినట్లు ప్రకటించిన కలెక్టర్
- 4,71,469 ఇళ్లు గుర్తిస్తే సర్వేలో 5,05,970 ఉన్నట్లు నిర్ధారణ
- ఆన్‌లైన్‌లో నమోదు 70శాతం మేర పూర్తి



తన కుటుంబ వివరాలు ఎన్యుమరేటర్లకు చెబుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే శుక్రవారంతో జిల్లాలో ముగిసింది. తొలుత ఇళ్లకు స్టిక్కర్లు వేసి సర్వే మొదలుపెట్టగా.. పూర్తయ్యే నాటికి అంతకంటే 34వేలకు పైగా ఇళ్లు ఉన్నట్లు తేలింది. అయితే, చాలామంది ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న తమ కుటుంబీల వివరాలను స్థానికంగా నమోదు చేయించడం.. పెళ్లి అయిన వారి వివరాలకు ఇంకో కుటుంబంగా పేర్కొనడంతో ఇళ్ల సంఖ్య పెరిగినట్లు భావిస్తున్నారు. ఏదిఏమైనా నత్తనడకన మొదలైన సర్వే ఎట్టకేలకు పూర్తవడంతో ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంపై దృష్టి సారించింది.

నవంబర్ 6న ప్రారంభం

నవంబర్ 6వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభించారు. తొలి రెండు రోజులు ఇళ్ల వారీగా స్టిక్కర్లు వేయడానికే కేటాయించారు. కానీ ఖమ్మం కార్పొరేషన్‌లో స్టిక్కర్లు వేసే ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగింది. ఆ తర్వాత ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వే ప్రారంభించారు. కాగా, శుక్రవారంతో సర్వే పూర్తికాగా 107.32 శాతంగా నమోదైందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రకటించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తొలుత 4,71,469 ఇళ్లను గుర్తించగా.. సర్వే ముగిసే నాటికి 5,05,970 ఇళ్లుగా నమోదైందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికం

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 3,51,238 ఇళ్లు ఉన్నట్లు మొదట గుర్తించారు. సర్వే ముగిసేవరకు 3,80,616 ఇళ్లు ఉన్నట్లు తేలగా 108.36 శాతంగా నమోదైంది. అలాగే, పట్టణ ప్రాంతాల్లో 1,20,231 ఇళ్లకు గాను 1,25,354 ఇళ్లు ఉన్నట్లు సర్వేలో వెల్లడి కావడంతో సర్వే శాతం 104.26గా వెల్లడించారు.

చకచకా ఆన్‌లైన్

సర్వే మొదలైన మూడు రోజుల తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం మొదలుపెట్టారు. జిల్లాలో ఇప్పటికే 70 శాతం మేర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సర్వే చేసిన ఎన్యుమరేటర్లే ఆపరేటర్ పక్కన ఉండి ఆన్‌లైన్ చేయిస్తున్నారని.. తద్వారా పొరపాట్లు దొర్లడానికి అవకాశముండదని వెల్లడించారు. కాగా, సర్వే ప్రారంభమైనప్పటి నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తోపాటు అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు సైతం పర్యవేక్షిస్తుండడంతో అవాంతరాలు ఎదురుకాకుండా పూర్తవడంతో యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.



సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

జిల్లాలో సర్వే ఇలా...

గుర్తించిన మొత్తం ఇళ్లు	4,71,469
గ్రామీణ ప్రాంతాల్లో..	3,51,238
పట్టణ ప్రాంతాల్లో..	1,20,231
పూర్తయ్యే నాటికి తేలిన మొత్తం ఇళ్లు	5,05,970
గ్రామీణ ప్రాంతాల్లో..	3,80,616
పట్టణ ప్రాంతాల్లో..	1,25,354

సంబురాలకు సిద్ధం..



ప్రజా విజయోత్సవాల సందర్భంగా విద్యుత్ లైట్లతో ముస్తాబు చేసిన కేఎంసీ కార్యాలయం

- నేడు, రేపు జిల్లాలో ‘ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు’
- ఈనెల 7తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది..
- సంవత్సరంలో ప్రభుత్వ పథకాలతో జిల్లా వాసులకు లబ్ధి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ‘ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు’ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఈనెల 7తో ఏడాది పూర్తికానుంది. ఈ సందర్భంగా ఆదివారం నుంచి 9వ తేదీ వరకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ఆధారంగా జిల్లాలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా, ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలైన రైతు రుణమాఫీ ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ తదితర పథకాల ద్వారా జిల్లావాసులకు లబ్ధి చేకూరింది. ఈ అంశాన్ని కూడా ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో వివరించనున్నారు.

రెండు రోజుల పాటు..

జిల్లాలో ఈనెల 1, 2వ తేదీల్లో ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజైన ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట చౌరస్తాలో ఉన్న టీ.సీ.వీ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో, 2న మధిరలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాలు ఉంటాయి. ఆయా తేదీల్లో సాయంత్రం 6గంటల నుండి అంతడుపుల నాగరాజు సారథ్యాన కళారూపాల ప్రదర్శన ఉంటుందని అధికారులు వెల్లడించారు.

సంక్షేమ పథకాలు, జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

- జిల్లాలో 3.73లక్షల మంది రైతులు రూ.2లక్షలలోపు రూ.2,400 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో 1,15,345 మంది రైతులకు రూ.772.57 కోట్ల రుణమాఫీ చేసింది. అయినా వివిధ కారణాలతో కొందరికి మాఫీ కాకపోవడంతో అర్హులను మరోసారి గుర్తించిన అధికారులు జాబితాను ప్రభుత్వానికి పంపారు. ఈమేరకు శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగ కార్యక్రమంలో నాలుగో విడత రుణమాఫీ చేయగా జిల్లాలోని 17,852 మంది రైతులకు రూ.154,03,20,242 నగదు విడుదల చేశారు.
- అర్హులైన పేదలకు ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలిన పనులను పూర్తిచేసి అర్హులకు అందజేస్తామని ప్రకటించారు. ఈ నిర్ణయంతో 911 ఇళ్లు పంపిణీ చేయనున్నారు. వీటికి తోడు మిగిలిన వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.
- రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందజేస్తోంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.834గా ఉంది. లబ్ధిదారులు ఈ ధరతో సిలిండర్ కొనుగోలు చేస్తే ప్రభుత్వం సబ్సిడీ నగదును ఖాతాల్లో జమ చేస్తోంది. జిల్లాలో 2,29,034 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా.. ఇప్పటివరకు వీరు 6,25,974 సిలిండర్లు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.17,41,71,550 సబ్సిడీ నగదు జమ అయింది.
- మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఈ ఏడాదిలో 4,25,04,358 మంది మహిళలు ప్రయాణించగా వారికి రూ.205.79 కోట్ల మేర లబ్ధి జరిగింది.
- తెల్ల రేషన్‌కార్డుదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. అక్టోబర్ నెలలో 2,48,211 కనెక్షన్లకు రూ.9.11 కోట్ల విలువైన విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించింది.

కమిషనరేట్‌కు 159 మంది కానిస్టేబుళ్లు

విధినిర్వహణపై సూచనలు చేసిన సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఇటీవల శిక్షణ పూర్తిచేసుకున్న సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లలో 159 మందిని ఖమ్మం పోలీసు కమిషనరేట్‌కు కేటాయించారు. ఇందులో సివిల్ విభాగం నుంచి 56మంది పురుషులు, 31మంది మహిళలు, ఏఆర్‌లో పురుషులు 56మంది మహిళా కానిస్టేబుళ్లు 16 మంది ఉన్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు శనివారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను కలవగా ఆయన విధినిర్వహణపై సూచనలు చేశారు. ప్రజల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లకుండా, వారి రక్షణే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. చాలామంది విద్యావంతులు ఉన్నా పోలీస్‌శాఖను ఎంచుకోవడం అభినందనీయమన్నారు. గతంతో పోలిస్తే పోలీసింగ్‌లో మార్పులు వచ్చినందున సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, క్రమశిక్షణ, నీతినిజాయితీని వీడొద్దని తెలిపారు. అదనపు డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, ఏసీపీలు సాంబరాజు, నర్సయ్య పాల్గొన్నారు. కాగా, కమిషనరేట్‌లో రిపోర్టు చేసిన 159మంది కానిస్టేబుళ్లకు త్వరలోనే పోస్టింగ్ ఇవ్వనుండగా స్టేషన్లలో సిబ్బంది కొరత తీరుతుందని భావిస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి



జమలాపురంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మధిర/ఎర్రుపాలెం: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి బరిలో దిగుతున్నట్లు వెల్లడించిన ఆయన తనను గెలిపిస్తే మండలిలో ఉపాధ్యాయుల వాణి వినిపిస్తానని తెలిపారు. ఈమేరకు మధిర, జమలాపురంలో శనివారం జరిగిన సమావేశాల్లో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా పీఆర్‌సీ సాధన, ఉద్యోగ విరమణ వయస్సు పెంపు తదితర సమస్యలపై గత ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించామని గుర్తుచేశారు. భవిష్యత్‌లోనూ పాత పింఛన్ విధానం అమలు, నగదు రహిత హెల్త్ కార్డులు, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు జారీతోపాటు గురుకులాలు, కేజీబీవీల్లో సమస్యల సాధనకు సంఘం ఆధ్వర్యాన కృషి చేస్తామని తెలిపారు. కాగా, మధ్యాహ్న భోజనంలో లోపాలు ఎదురైతే ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయకుండా సామగ్రి, కార్మికుల ధరలు మార్కెట్ రేటు ఆధారంగా చెల్లించాలని శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావుతో పాటు బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరరావు, మదార్, తూమాటి కృష్ణారెడ్డి, రవికుమార్, శ్రీనివాసరావు, బొగ్గుల మదన్‌మోహన్‌రెడ్డి, పాటి బాలకృష్ణ, గురునాథరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, పుట్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

చింతకాని: ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆమె మందుల నిల్వలు, ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణ, రోజువారీ ఓపీ తదితర వివరాలపై ఆరాతీయడమే కాక రిజిస్టర్లను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, 2వ తేదీ నుంచి మొదలయ్యే కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. ఆతర్వాత లచ్చగూడెంలో వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. అధికారులు డాక్టర్ రామారావు, దుర్గ, మండల వైద్యాధికారి అల్తాఫ్‌తో పాటు సీహెచ్‌ఓ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదు లే ఔట్లకు అనుమతి

ఖమ్మంమయూరిసెంటర్: లే ఔట్ల అనుమతుల కోసం అందిన దరఖాస్తులను ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో పరిశీలించారు. ఈ సందర్భంగా 13 దరఖాస్తులకు గాను అన్నీ సక్రమంగా ఉన్న ఐదింటికి అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన వాటికి సంబంధించి ఎన్‌ఓసీలు పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

ఉన్నత చదువులకు వెళ్లి.. అనంతలోకాలకు

- అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఖమ్మం విద్యార్థి మృతి
- ఐదు నెలల క్రితమే వెళ్లిన సాయితేజ



అమెరికా వెళ్తున్నప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో సాయితేజతో తల్లిదండ్రులు (ఫైల్)

ఖమ్మంక్రైం: ఉన్నత చదువులు పూర్తి కాగానే తమ కుమారుడు ఉద్యోగంలో చేరి కుటుంబానికి ఆసరాగా నిలుస్తాడని భావిస్తున్న తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. కుమారుడిని గొప్ప స్థాయిలో చూడాలని ఆశించి వారు అమెరికాకు పంపించగా అక్కడ దుండుగులు జరిగిన కాల్పుల్లో మృతి చెందాడనే సమాచారం అందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎంబీఏ చదివేందుకు వెళ్లిన ఐదు నెలల్లోనే జిల్లాకు చెందిన నూకారపు సాయితేజ(25) మృతి చెందినట్లు సమాచారం అందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

అక్క అక్కడే..

ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటకు చెందిన నూకారపు కోటేశ్వరరావు కుటుంబంతో కలిసి ఖమ్మం రాపర్తినగర్‌లోని రమణగుట్టలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య వాణితో పాటు కుమార్తె ప్రియ, కుమారుడు సాయితేజ ఉన్నారు. కొన్నాళ్ల క్రితమే ప్రియ అమెరికాకు వెళ్లగా ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. కుమారుడైన సాయితేజ హైదరాబాద్‌లో ఇంటర్, బీబీఎం పూర్తిచేశాక అమెరికా ఎంబీఏ చేసేందుకు పంపించారు. ఆయనకు చికాగో ప్రాంతంలోని కాంకాడ్సి యూనివర్సిటీలో సీటు రావడంతో ఈ ఏడాది జూన్ 15వ తేదీన అక్కడకు బయలుదేరాడు. అమెరికా వెళ్లాక సాయితేజ మరికొందరు స్నేహితులతో కలిసి అద్దె గదిలో ఉంటూ పార్ట్‌టైం ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు. ఖమ్మంలో ఉన్న తల్లిదండ్రులకే కాక అమెరికాలోని మరో ప్రాంతంలో ఉన్న తన సోదరి ప్రియకి ఫోన్ చేస్తుండేవాడు. వారంలో కనీసం మూడు రోజులైనా గ్రూప్ కాల్ మాట్లాడుకునేవారు. ఎంబీఏ పూర్తికాగానే మంచి ఉద్యోగం సాధిస్తానని, తల్లిదండ్రులను సైతం అమెరికా తీసుకెళ్తానని తరచుగా చెప్పేవాడు.

ఏం జరిగింది...

సాయితేజ అమెరికాలోని ఓ స్టోర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున ఆయన క్యాష్‌కౌంటర్‌లో ఉండగా తుపాకులతో వచ్చిన దుండగులు బెదిరించడంతో డబ్బులు ఇచ్చేసి పక్కన నిల్చున్నాడు. ఇంతలో ఏం జరిగిందో ఏమో కానీ దుండగులు అతి సమీపం నుంచి కాల్చడంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులు ఆయన స్నేహితులకు తెలపడంతో వారు కోటేశ్వరరావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. కాగా, శుక్రవారం కూడా సాయితేజ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడగా శనివారం ఫోన్ కోసం ఎదురుచూస్తుండగా పిడుగు లాంటి వార్త తెలియడంతో కన్నీరుమున్నీరయ్యారు. తల్లి వాణికి మృతి చెందినట్లు కాకుండా గాయాలయ్యాయని మాత్రమే చెప్పారు. అమెరికాలోని తానా సభ్యులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడి సాయి మృతదేహాన్ని త్వరగా పంపించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో ఐదు రోజుల్లో మృతదేహం వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎంపీలు, ఎమ్మెల్సీ సంతాపం

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: అమెరికాలో ఖమ్మం విద్యార్థి నూకారపు సాయితేజ మృతి చెందడంపై ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే, అమెరికా నుంచి సాయితేజ మృతదేహాన్ని త్వరగా రప్పించేలా కృషి చేస్తామని తెలిపారు. కాగా, సాయితేజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు. ఆయన మృతదేహాన్ని ఖమ్మం త్వరగా పంపించేలా ఏర్పాట్లు చేయాలని తానా బాధ్యులైన లావు అంజయ్య చౌదరి, లావు శ్రీనివాస్ తదితరులను ఫోన్‌లో కోరారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు బెల్లం వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన రేషన్ డీలర్లు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

ఖమ్మం సహకారనగర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రేషన్‌డీలర్లు శనివారం వినతిపత్రం అందజేశారు. డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయి కోటిరాజు ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా, నగర రేషన్‌డీలర్లు బానోత్ వెంకన్న, జానీమియా తదితరులు మంత్రిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కమీషన్ పెంచడమే కాకుండా గౌరవ వేతనం అమలుచేయాలన్నారు. అలాగే, ఖమ్మంలో వరదల సందర్భంగా బియ్యం నష్టపోయిన డీలర్లు తిరిగి కోటా కేటాయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో డీలర్ల సంఘం నాయకులు దొండ దుర్గయ్య, షేక్ ఇబ్రహీం, శేషగిరిరావు, వట్నాల బాబు, జానీ, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్' భూమి పరిశీలన



భూమి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

బోనకల్: మండలంలోని పెద్దబీరవల్లి రెవెన్యూ పరిధిలో అమరావతి–నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి 190 సర్వే నంబర్‌లోని భూమిని ఆర్డీఓ నరసింహారావు శనివారం పరిశీలించారు. ఈ భూమిలో నలుగురు రైతులు సాగు చేసుకుంటుండగా, అక్కడి నుంచే వాగు వెళ్తోంది. ప్రభుత్వ భూమి అయినందున రైతులకు పరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు వెల్లడించారు. అయితే, గత యాభై ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని, వరదల సమయాన కోతకు గురైనప్పుడు నష్టపోయామని రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు భూములను పరిశీలించిన ఆర్డీఓ మాట్లాడుతూ నష్టపరిహారం అందేలా చూస్తామని, పనులకు మాత్రం ఆటంకం కలిగించొద్దని సూచించారు. తహసీల్దార్ పున్నంచందర్, ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ

సత్తా చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ

- ఖమ్మం కార్పొరేషన్ మేయర్ నీరజ
- ఉమ్మడి జిల్లా స్థాయి టీ.టీ. పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని.. ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా ఆ ఒరవడి కొనసాగించాలని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పి.నీరజ సూచించారు. ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపైనా దృష్టి సారించాలని తద్వారా స్నేహసంబంధాలు పెరుగుతాయని తెలిపారు. కాగా, త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న ముఖ్యమంత్రి కప్ పోటీలను విజయవంతం చేయాలన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్ ఉన్నందున క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి జిల్లాలో క్రీడాకారుల శిక్షణకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడగా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీ.వీ.సాంబమూర్తి పాల్గొన్నారు. కాగా, ఈ పోటీలకు అశ్వాపురం, పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాలకు చెందిన 140 మంది బాలబాలికలు, సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళలు హాజరయ్యారు. తొలిరోజు అండర్–11 బాలికల సింగిల్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా బి.హారిక, బి.తన్మయ్, డి.సాన్వి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ఆర్గనైజర్లు ప్రవీణ్, రాజేష్, మజహర్, చలపతిరావు, పవన్, రామారావు, కామేశ్వరి, భవ్య, లావణ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



తొలిరోజు పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో నిర్వాహకులు

జాతీయస్థాయిలో గుర్తింపే లక్ష్యం



జిల్లాను జాతీయస్థాయిలో అగ్రభాగాన నిలపడమే లక్ష్యంగా క్రీడాకారులతో ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ఇప్పటికే స్నేహిత్ అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. పలువురు జాతీయస్థాయి పోటీలకు హాజరయ్యారు. మరింత మందిని తీర్చిదిద్దడమే అసోసియేషన్ లక్ష్యం.

– వీ.వీ.సాంబమూర్తి, టీ.టీ. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

14, 15వ తేదీల్లో టీఎస్‌యూటీఎఫ్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: సత్తుపల్లిలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విద్యా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ ప్రభుత్వం విడుదల చేయాలని, ఎన్నికల వేళ ప్రకటించినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఐదు వేల ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని కోరుతూ తీర్మానించారు. తొలుత రాష్ట్ర నాయకుడు షేక్ మహబూబ్ అలీకి నివాళులర్పించారు. నాయకులు షేక్ ఉద్దండ్ షరీఫ్, రోజా, సాంబమూర్తి, పద్మజ, శ్రీదేవి, రాంబాబు, షరీఫ్, రవి, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మహాసభలో ఖమ్మం నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్యాంకుమార్, రోజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పత్తి వ్యాపారులకు నోటీసులు, కాంటాల స్వాధీనం



వ్యాపారికి నోటీసులు అందజేస్తున్న ఉద్యోగులు

కారేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతి లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులకు ఇల్లెందు మార్కెట్ ఉద్యోగులు శనివారం నోటీసులు అందజేశారు. అనంతరం వారి వద్ద ఉన్న తూకం కాంటాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేయొద్దని, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమిటీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు లక్ష్మయ్య, మధు, హరికృష్ణ, మోహన్‌రావు, రంజిత్, చందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు జర్నలిస్టులపై కేసు నమోదు

రఘునాథపాలెం: పత్రికలకు రూ.10 వేల ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహిళా ఉద్యోగితో వాగ్వాదానికి దిగి అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు జర్నలిస్టులపై శనివారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి శనివారం విధులు నిర్వర్తిస్తుండగా వెంకటేశ్వర్లుతో పాటు మరో వ్యక్తి వెళ్లి తాము ఆదాబ్ ఇండియా, ఎన్6 న్యూస్ పత్రికా విలేకరులమని చెప్పారు. తమ పత్రికలకు రూ.10వేల ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేసి ఆమె నిరాకరించడంతో వాగ్వాదానికి దిగి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించారని డీడీ ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇళ్లు ఇప్పిస్తానని రూ.లక్షల్లో వసూళ్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలోని సముదాయంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని అక్కడే నివాసం ఉంటున్న శివ అనే వ్యక్తి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం శివపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఇళ్లు ఇప్పిస్తానని ఐదుగురి వద్ద రూ.లక్ష చొప్పున శివ వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందిందని వెల్లడించారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం



సత్యనారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని రామచంద్రాపురం పాఠశాల హెచ్‌ఎంగా, విద్యారంగ అభివృద్ధికి దండెం సత్యనారాయణరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. జమలాపురంలో శనివారం నిర్వహించిన సత్యనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో వారు మాట్లాడారు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే కాక జూనియర్, డిగ్రీ కళాశాలలు నెలకొల్పి పేదపిల్లలకు విద్యనందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం సత్యనారాయణరెడ్డి–అలివేలు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, పార్టీల నాయకులు, విద్యాసంస్థల యాజమాన్యాల ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, బొగ్గుల మదన్‌రెడ్డి, పాటి బాలకృష్ణ, జంగా గురునాథరెడ్డి, శెట్టిపల్లి సంగిరెడ్డి, ఆర్.బ్రహ్మారెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, చావా రామకృష్ణ, శీలం వెంకటరెడ్డి, ప్రభాకర్, మురళీమోహన్, అంకసాల శ్రీనివాసరావు, శీలం కవిత, దేవరకొండ శిరీష, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పంబి సాంబశివరావు, దివ్వెల వీరయ్య, జె.గోపాలకిషన్‌రావు, మిర్యాల శ్యాంప్రసాద్, సామినేని గిరిధర్, సూర్యనారాయణ, అంజన్‌బాబు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించని మహిళలపై కేసు

ఖమ్మంక్రైం: బంగారు ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించని ముగ్గురు మహిళలపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని సాయిరాం జ్యూయలర్స్ యజమాని చౌడవరపు భవాని వద్ద నుంచి ఖానాపురం ప్రాంతానికి చెందిన గుడిపాటి కమల, జూలురుపాడుకు చెందిన కోడిరెక్కల ప్రశాంతి, తల్లాడకు చెందిన గడిసెల ధనలక్ష్మి అలియాస్ శిరీష కొన్నాళ్ల క్రితం వచ్చారు. తొలుత రూ.లక్ష, ఆపై రూ.2లక్షలు, అనంతరం రూ.5లక్షల విలువైన ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించారు. ఈక్రమాన వారిని యజమాని భవానీ నమ్మింది. ఆతర్వాత త్వరలోనే నగదు ఇస్తామని చెప్పడంతో ఆమె తన షాపుతో పాటు చుట్టుపక్కల షాపుల నుంచి రూ.35లక్షల విలువైన ఆభరణాలు ఇచ్చింది. కానీ ఎంతకూ డబ్బు చెల్లించకపోవడంతో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.



కాటేస్తున్న ఎయిడ్స్ భూతం..!

మృత్యువుకు బీజాలు వేస్తున్న మహమ్మారి

- జిల్లాలో నమోదైన కేసులు 17,199
- వ్యాధితో 4,200 మంది మృతి
- ఈ ఏడాది 285 కొత్త కేసులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శనలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది (ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: ఎయిడ్స్ భూతం యువతను నీడలా వెంటాడుతోంది. అవగాహన లేమితో యువతీ, యువకులు హెచ్‌ఐవీ బారిన పడుతున్నారు. ఈ దెబ్బకు కొన్ని కుటుంబాలే కనుమరుగవుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ద్వారా నివారణ చర్యలు తీసుకుంటున్నా వ్యాధి వ్యాప్తిని అరికట్టలేకపోతున్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో జిల్లాలో ప్రతి నెలా 50కి పైగా హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇవి అధికారిక లెక్కలు మాత్రమే.. అనధికారికంగా చాలానే ఉన్నాయి. కాగా, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఏటా డిసెంబర్ 1న వరల్డ్ ఎయిడ్స్ డేను నిర్వహిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. వ్యాధి బారినపడి ఏటా వందలాది మంది మృత్యువాత పడుతూనే ఉన్నారు.

జిల్లాలో 17,199 కేసులు..

జిల్లాలో ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పటి వరకు అధికారికంగా 17,199 మందికి వ్యాధి సోకినట్లు గుర్తించారు. అవి వివిధ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా నమోదైన కేసులు కాగా వీరిలో ఎంతమంది బతికిఉన్నారో తెలియని పరిస్థితి ఉంది. జిల్లాలో రెండేళ్ల క్రితం 16,307 మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య మరింత పెరిగింది. వీరిలో ప్రతి నెలా క్రమంతప్పకుండా 6,732 మంది మందులు వాడుతుండగా.. 2,584 మందికి ఏఆర్‌టీ ఆసరా పెన్షన్ కింద నెలకు రూ. 2,116 పొందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో నెలకు సగటున 50కి పైగా కొత్తగా పాజిటివ్ కేసులు నమోదవుతుండడం గమనార్హం.

4,200 మంది మృత్యువాత..

జిల్లాలో ఎయిడ్స్ బారిన పడి మృతి చెందే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. 2006 నుంచి ఇప్పటి వరకు 4,200 మంది మృత్యువాత పడ్డారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జిల్లా వ్యాప్తంగా 61,056 మంది వ్యక్తులకు హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు జరపగా 285 మందికి వ్యాధి సోకింది. ఇందులో 17,628 మంది గర్భిణులలో 12 మందికి సోకింది. జిల్లాలో హైరిస్క్ ప్రవర్తన కలిగిన వ్యక్తులు 2,595 మంది ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అందులో ఫీమేల్ సెక్స్ వర్కర్లు 1,788, స్వలింగ సంపర్కులు 727, ట్రాన్స్‌జెండర్లు 80 మంది ఉన్నారు. వారి కోసం జిల్లాలో జాగృతి స్వచ్ఛంద సంస్థ పనిచేస్తూ వారి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాయి. జిల్లాలో ఎయిడ్స్ వ్యాధికి సంబంధించి 4 ఐసీటీసీ కేంద్రాలు, 38 ఎఫ్ఐసీటీసీ కేంద్రాలు, 161 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, 9 బస్తీ దవాఖానాలు, 1 ఏఆర్‌టీ కేంద్రం, 2 లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, 10 రక్త నిధి కేంద్రాలు పనిచేస్తున్నాయి.

జిల్లాలో గత ఐదేళ్లుగా నమోదైన కేసులు

ఏడాది	కేసులు	చేసిన పరీక్షలు
2020-21	373	45,855
2021-22	445	47,714
2022-23	512	86,120
2023-24	559	1,18,796
2024-25	285	61,056
(అక్టోబర్ వరకు)		

వ్యాధి సంక్రమణ ఇలా..

ఒకరికంటే ఎక్కువ మందితో సంభోగంలో పాల్గొనడం వల్ల, రక్త మార్పిడి, తల్లి నుంచి బిడ్డకు, కలుషిత సిరంజీల వల్ల ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుంది. ముందుగా ఈ వ్యాధిని ప్రాణాంతక వ్యాధిగా పరిగణించేవారు కానీ శక్తివంతమైన ఏఆర్‌టీ మందులు, ఎయిడ్స్ వల్ల వచ్చే రుగ్మతలను నయం చేసే మందులు ఉన్నందున ఇప్పుడు ఈ వ్యాధిని మధుమోహం, హైపర్ టెన్షన్ లాంటి వ్యాధుల లాగే దీర్ఘకాలిక, నియంత్రించడానికి వీలు కలిగే వ్యాధిగా వ్యవహరిస్తున్నారు.

హెచ్‌ఐవీ నిర్ధారణ ఇలా..

ఎయిడ్స్ హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో డెఫిసియెన్సీ వైరస్) అనే వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకితే శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తుంది. తద్వారా ఎయిడ్స్ ఆహ్వానిత వ్యాధులు రావడం మొదలుపెడతాయి. హెచ్‌ఐవీ వైరస్ ఉన్న అందరికీ ఎయిడ్స్ ఉన్నట్లు కాదు. అవి శరీరం లోపల ఉన్నా కొన్నేళ్ల పాటు ఆరోగ్యంగానే కనిపిస్తారు. వారికి ఎప్పుడైతే ఆరోగ్యం నశిస్తుందో అప్పుడు ఎయిడ్స్ వచ్చినట్లు పరిగణిస్తారు. రక్త పరీక్ష చేసిన సమయాన రోగనిరోధకత బాగా క్షీణించినప్పుడు వ్యాధి లక్షణాలు త్వరగా బయటపడుతాయి. వీటి నిర్ధారణ కోసం సీడీ4 పరీక్షలో కణాల సంఖ్య 200 కంటే తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాధి సోకినట్లుగా గుర్తిస్తారు.

ఫొటోగ్రాఫర్‌కు జాతీయస్థాయి అవార్డు

తిరుమలాయపాలెం: ఏపీ రాష్ట్రం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాకు చెందిన షేక్ మోహినుద్దీన్ అవార్డు అందుకున్నారు. ఆయన తీసిన ఫొటోకు గాను పి.దశరథకుమార్ స్మారక అవార్డును శనివారం ఏపీ ఉన్నత విద్యాశాఖ చైర్మన్ కె.రాంమోహన్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రత్నశీలామణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే శ్రద్ధగా చదువుతూ మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి సూచించారు. ఖమ్మం రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాక విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్‌కె.సోందు, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బైరవునిపల్లి వాసికి డాక్టరేట్



రేణుబాబు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లికి చెందిన మల్లెబోయిన రేణుబాబు డాక్టరేట్ అందుకున్నారు. ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఏపీలోని రాయలసీమ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. రేణుబాబు ప్రస్తుతం హైదరాబాద్‌లోని టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

కొరియర్ సెంటర్‌లో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం నర్తకి థియేటర్ సమీపాన ఓ కొరియర్ సెంటర్ కార్యాలయంలో చోరీ జరిగింది. కార్యాలయం తాళాలను శుక్రవారం అర్ధరాత్రి పగులకొట్టిన ఇద్దరు వ్యక్తులు కౌంటర్‌లో భద్రపర్చిన రూ. 80వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు శనివారం ఉదయం గుర్తించిన ఉద్యోగులు ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు దర్యాప్తు చేపట్టారు.

కాల్వలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలోని సాగర్ ఇన్‌ఫ్లో కాల్వలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి దూకగా ఆయన మృతదేహం పాలేరు రిజర్వాయర్‌లో శనివారం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన గుడివాడ ఉపేందర్(35) నాయకన్‌గూడెంలోని తన అత్తగారింటికి వచ్చాడు. ఆయన భార్య ఉమ పుట్టింట్లో ఉండగా కాపురానికి రావడానికి నిరాకరించడంతో మనోవ్యధకు గురైన ఆయన సమీపంలోని సాగర్ కాల్వలో దూకాడు. అప్పటి నుంచి గాలిస్తుండగా రిజర్వాయర్‌లో శనివారం మృతదేహం లభ్యమైంది. ఘటనపై ఉపేందర్ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.